# విస్ఫోటం

తిన్నగా పోలీస్ స్టేషన్ కెళ్ళి ఇన్‌స్పెక్టర్ వీరనాయుడికి నమస్కరించి "నన్ను అరెస్టు చెయ్యండి సార్" అన్నాడు వినయంగా మూర్తి.

ఇన్‌స్పెక్టరే కాదు మొత్తం స్టేషనే ఉలిక్కిపడింది.

"చూడ్డానికి మర్యాదస్తుల్లా వున్నావ్. ఏం చేశావ్ బే? కట్నం గురించి కోడల్ని వేధించావా అక్రమ సంబంధం వుందని భార్యని హింసించావా?"

"లంచం ఇచ్చాను సార్"

"వ్వాట్...?"

"మీరు విన్నది కరక్టే సార్. నేను లంచం ఇచ్చాను. ప్రివెన్షనాఫ్ కరప్షన్ యాక్ట్ 1988 ప్రకారం నేను శిక్షార్హుడ్ని. నన్ను అరెస్టు చేసి శిక్షించండి సార్"

"అబ్బో. యాక్ట్ కూడా తెలుసే. బోడి యాక్షన్ మాని వెనక్కి తిరక్కుండా ఫో. అసలే వీఐపీలకి సెక్యూరిటీ ఇవ్వలేక ఛస్తోంటే వెధవ లా పాయింట్లు! ఎక్కడో ఎర్రగడ్డ సరుకు.....!"

అతడింకా అక్కడే అలాగే నిలబడి వుండటం చూసి సర్రున బుసకొట్టిన కోపాన్ని నిగ్రహించుకుంటూ అన్నాడు "నీ ఒళ్ళెలా వుంది. పోలీసుదెబ్బలు కావాలంటోందా?"

"మీరెలాంటి శిక్ష విధించినా సరే స్వీకరించడానికి సిద్ధంగా వున్నాను సార్"

"వీడ్నెవడ్రా లోపలికి రానిచ్చింది. బుర్ర తినేస్తున్నాడు! ఏరా. లంచం ఎంతిచ్చావేంటి? లక్షలా కోట్లా?"

"అయిదు వందలండి"

పడీ పడీ నవ్వేడు ఇన్‌స్పెక్టర్. సన్నగా నవ్వేరు పీసీలు.

"లక్షలకోట్ల అవినీతికే దిక్కూ దివాణం లేదు ఇక నీ బోడి అయిదొందలలో లెక్కా? వెళ్ళెళ్ళు"

"క్షమించాలి. నేను నేరస్తుడ్ని....."

"ఒరే ఒరే..... వీడ్ని ప్రక్కకి తీసుకు పోండ్రా బూతులొచ్చేస్తున్నాయ్....." నుదురు కొట్టుకున్నాడు.

రైటరూ హెచ్ సీ వచ్చి నచ్చ చెప్పేరు గాని అతడు పట్టు వదల్లేదు.

"పొద్దుటే మా గొప్ప కేసు దొరికింది. ఒరే. నీ దగ్గర లంచం తీసుకున్న ఆ దౌర్భాగ్యుడెవడ్రా"

"తాశిల్దారుగారండి"

అటెన్షన్‌లో కొచ్చాడు ఇన్‌స్పెక్టర్ "పెద్దవాళ్ళ మీద బురద జల్లితే టీవీలో కన్పించొచ్చని ప్లానేసేవేంట్రా?"

"నేను వారిని నిందించడం లేద్సార్ నా నేరాన్ని అంగీకరిస్తున్నానంతే....." పిటీషన్ అందిస్తూ అన్నాడు.

"ఇదెక్కడి పితకలాటరా. నువ్వొప్పుకుంటే అయిపోదురా అసలు కథ అక్కడే మొదలవ్వుద్ది..... ఒరే ఈ కేసులూ కోర్టులూ జైళ్ళూ – ఈ గొడవంతా ఎందుకు చెప్పు. నామాటిని తిన్నగా ఇంటికెళ్ళు. దార్లో బిర్యానీ తిని ఇంటికెళ్ళి మందుకొట్టి పడుకో. అన్నీ సెటిలైపోతాయ్"

"నేను నేరస్తుడ్ని సార్"

"అబ్బా! చంపుతున్నావు కదరా....సరే.... నువ్వు నేరం చేశావనడానికి ఋజువులూ సాక్ష్యాలూ గట్రా వున్నాయా?"

"ఉన్నాయండి. తాశిల్దారు ఆఫీసులోని అసిస్టెంటు సోమేశ్వరావుకి తెలుసండి. అసలాయనే తాశిల్దారు గార్కి డబ్బిస్తే పనవ్వుద్దని చెప్పేరండి. మన్లో మన మాట. ఆయనకి రెండొందలు ఇచ్చానండి....."

"ఇచ్చావూ? ఇస్తావు. అతడేనా లేక ప్రత్యక్ష సాక్షులు కూడా వున్నారా?"

"ఉన్నారండి. బిళ్ళబంట్రోతు నారయ్యే ఎదురుగానే ఇచ్చానండి. అతగాడి చేతిలో యాభై నోటుకుక్కేకే ఆఫీసులోకి వెళ్ళనిచ్చాడండి"

"అందరికీ నీ ఇష్టమొచ్చినట్టు ఇచ్చుకుంటూ పోయి కడాకరుకి నేరం చేశానండీ అంటూ నా మీద పడ్డావేంట్రా! చూస్తోంటే ఇదేదో నా పీకల మీదకొచ్చే యవ్వారంలా వుంది..... అసలెందుకిచ్చావురా?"

"కులధృవీకరణ పత్రానికండి... అమ్మాయి స్కాలర్ షిప్ కోసం అవసరమయ్యా..."

విసుక్కుంటూనే అయిష్టంగానే తాశిల్దారుకి ఫోన్ చేశాడు ఇన్‌స్పెక్టర్.

"నమస్తే సార్... ఇన్‌స్పెక్టర్ వీరనాయుడ్ని....."

"ఏమయ్యా బావున్నావా?"

"ఏం బాగులెండి సార్. పొద్దుటే మెంటల్ కేసొచ్చింది..... మీకు అయిదొందలు లంచమిచ్చానంటూ....."

"అలా కూసిన బద్మాష్ ఎవడు? వాడ్ని లాకప్పులో పడేసి మక్కెలిరగ్గొట్టండి....."

"అతడు కోరుతోందీ అదే. లంచం ఇచ్చాను అరెస్టు చేసి శిక్ష వేయించమంటున్నాడ్సార్"

"నాకెవడూ లంచం ఇవ్వలేదు. నేను నిప్పులాంటి వాడ్ని. నీకు తెలుసుగా నాపేరే నిప్పుల అప్పారావు"

"మరీ... ఇవాళ ఎస్పీగారి విజిట్టుంది. ఆయన దృష్టికెళ్తే..... ఆయన సంగత్తెలుసుగా ఎప్పుడూ న్యూస్‌లో ఉండాలని తెగ తాపత్రయ పడుతూంటారు"

సరిగ్గా పది నిమిషాలకి ధుమధుమ లాడుతూ తాశిల్దారు నిప్పుల అప్పారావు స్టేషన్ కొచ్చాడు.

"నా మీద కంప్లయింట్ చేసిన వాడెవడు? ఎక్కడ?"

ఇన్‌స్పెక్టరేదో చెప్పేలోగా మూర్తి చేతులు కట్టుకుని ముందు కొచ్చి, "క్షమించాలి సార్. మీ మీద కంప్లయింట్ చెయ్యలేదు" అన్నాడు.

"నా మీద చెయ్యలేదా. దెన్....?" వీరనాయుడి వంక అర్థోక్తితో చూశాడు.

"ప్లీజ్ కూర్చోండి సార్. ఇతడెవరి మీదా కంప్లయింట్ చెయ్యలేదు. తను లంచం ఇచ్చి నేరస్తుణ్ణయ్యాననీ అరెస్టు చెయ్యమనీ కోరుతున్నాడు....."

"ఇదెక్కడి పిచ్చి?" బుర్రగోక్కున్నాడు.

"ఆ పిచ్చే మా గొంతుక్కి అడ్డం పడింది.....!"

"లాకప్‌లో పారేస్తే సరి పిచ్చీ తిక్కా అన్నీ వదలిపోతాయి" అక్కసుగా అన్నాడు.

"అలా చేయాలంటే ఎఫ్ఐఆర్ రాయాలి. కేసు విచారించాలి, మిమ్మల్ని ప్రశ్నించాలి. మీ వాఙ్మూలమూ సాక్ష్యమూ రికార్డు చేయాలి....."

"అబ్బెబ్బే. నేనెలా ఇస్తాను? ఇతగాడు నాకు లంచం ఇచ్చాడని నేను సాక్ష్యం ఇస్తే ఇంకేమైనావుందా కొంపకొల్లేరైపోదూ?!"

"తమరికిచ్చిన మాట నిజమే కదండీ. ఆ ముక్క చెప్పండి చాలు చచ్చిమీ కడుపున పుడతాను" అన్నాడు మూర్తి.

"నువ్వు చావా వద్దు నన్ను చంపా వద్దు. ఏదో బుద్ధి గడ్డితిని... ఇంక వదలి పెట్టరా నీకు పుణ్యం వుంటుందీ!"

తాశిల్దారు మాటలకి లెంపలేసుకున్నాడు "నిన్న తమరికి లంచం ఇచ్చినందుకు రాత్రి నిద్రపడితే ఒట్టు. ఈ పాపం నాకొద్దండి. నేను శిక్ష అనుభవించాల్సిందే"

హెడ్ కానిస్టేబుల్ ముందుకొచ్చి నచ్చ చెప్పబోయాడు "చూడయ్యా. నువ్వు చాలా మంచివాడివి. పాపభీతి గలవాడివి. తాశిల్దారుగారు పిల్లలు గలవారు. వారికి అపకారం తలపెడితే పుట్టగతులుండవు....."

"అబ్బెబ్బే. నేనెందుకుపెడతానండి. ఆయన చాలా మంచోరు. అయిదొందలిచ్చే సరికి ఠకీమని సంతకం పెట్టిచ్చిన ధర్మాత్ములు.....!"

"ఒప్పుకున్నావు కదా? మగంచేత నువ్వాయన కిచ్చింది దానం... అహహ గిఫ్టు-బహుమతి అన్నమాట....."

"భలేవాడివే. నేనెందుకు బహుమతిస్తాను? ఈయనేమన్నా నా బామ్మర్ది లేక వేలువిడిచిన మేనమావ కొడుకా! లంచమే ఇచ్చాను"

ఖరాఖండీగా చెప్పేసరికి నివ్వెరబోయి మొఖా మొఖాలు చూసుకున్నారంతా.

"పోనీ దానం చేశాననుకో. గాలికెగిరిన పేలపిండి కృష్ణార్పణం అనుకుని ఓ దణ్ణం పెట్టి వదిలెయ్"

"దానం చెయ్యకుండా చేశాననడం తప్పేకాదు పాపం కూడానండి"

"మరిప్పుడేం చెయ్యమంటావో చెప్పేడు" కోపంగా అరిచాడు తాశీల్దారు.

"మీరంతా కలిసి ఎలాగైనా సరే నాకు శిక్ష పడేట్టు చూడండి సార్"

"ఒరే ఒరే... నిన్నిప్పుడు బయటికీడ్చి పడేస్తే ఏం చేస్తావురా?" కళ్ళెర్ర జేశాడు వీరనాయుడు.

"అదిగో స్టేషన్ ఎదురుగుండా వుందే ఆ చెట్టు కింద బైఠాయిస్తానండి. నాకు శిక్షపడే దాకా కదల్నండి....."

"అప్పుడు మీడియా వాళ్ళు గద్దల్లా వాలిపోతారు. దారినపోయే దానయ్యలని మీరేమంటారంటూ కందిరీగల్లా కుట్టి వారి అరుపుల్ని లైవ్‌లో ప్రసారం చేసేస్తారు!"

వీరనాయుడి మాటలకి తాశీల్దారు మొఖంలోని రక్తమంతా ఇంకిపోయింది. గబుక్కున మూర్తి చేతిలో అయిదు వంద నోట్లు కుక్కి "ఇంకా గొడవ మర్చిపో" అన్నాడు.

చేతిలో పాము పిల్ల పడినట్టు డబ్బుని ఆయన మీదకి విసిరేసి "నాకొద్దండి. తవరికిచ్చింది తిరిగి పుచ్చుకునేంత దుర్మార్గుడ్ని కాదు" అన్నాడతడు.

"ఫైన్ క్రింద ఇంకో అయిదొందలు కలిపివ్వండి..... మంచి డీల్... పుచ్చుకోవోయ్....."

ఇన్‌స్పెక్టర్ మాటలకి రెండడుగులు వెనక్కేసి వద్దంటూ సైగ చేసి దణ్ణం పెట్టేడు.

మూర్తి భుజం మీద చెయ్యేసి తన సీటు దగ్గరికి తీసుకెళ్ళి కుర్చీ లాగి కూర్చోమన్నాడు వీరనాయుడు.

"తమరి ముందు.... వద్దు సార్..... నేరగాడ్ని. మీ ముందు నిలబడే వుండాల్సార్"

"నువ్వు నాకు నచ్చావోయ్ మూర్తీ. ఊళ్ళో అంతా నీలాటి వాళ్ళే వుంటే ఇక ఈ స్టేషన్లే ఎత్తేయొచ్చు. మరేంటంటే- తాశిల్దారుగారు నీలాగే నిఖార్సైన మనిషి. ఏదో పొరబాటున నీ దగ్గర డబ్బు తీసుకున్నారు గాని ఆయన అలాంటి వారు కాదు..."

"నేను మాత్రం వీరికి లంచమే ఇచ్చానండి"

"అంతా నేనే తినేశాననుకుంటున్నాడు పిచ్చోడు. పై వాళ్ళకి రకరకాల రూపాల్లో ఎంత ముట్ట జెప్పానో వీడికేం తెలుసు!" చిర్రుబుర్రు లాడాడు తాశీల్దారు.

"గట్టిగా అనకండి సార్ వాళ్ళనీ ముగ్గులోకి లాగుతాడు"

తాశిల్దారు గమ్మునుండి పోయాడు.

"సరే, జరిగిందేదో జరిగింది. ఇప్పుడు పరిష్కార మార్గమేంటో చెప్పు చేసేద్దాం"

"లంచం ఇచ్చిన నేరానికి నన్ను అరెస్టు చేసి సెల్లో కూచోబెట్టండి సార్. ఆనక కోర్టు కప్పగించండి"

"మళ్ళీ మొదటి కొచ్చావేంట్రా!" కళ్ళెర్ర జేశాడు వీరనాయుడు.

మూర్తిని దూరంగా నిలబడమని చెప్పి, "ఇప్పుడేం చేద్దాం సార్. తాత్సారం చేస్తే నేను యాక్షన్ తీసుకోలేదని ఎస్పీకి కంప్లయింట్ చేస్తాడు. మధ్యలో మీరుండి పోయారు లేకపోతే ఈ పాటికి విరగదీసేవాడ్ని" మీసాలు సవరించుకున్నాడు.

"మీడియా కంటికి తెలీకుండా ఎలావోలా హుషప్ చేసెయ్యి. ఎఫ్ఐఆర్ రాయకుండా రాసినట్టు చెప్పి ఓ గంట లాకప్‌రూంలో కూర్చోబెట్టి ఇదే శిక్ష అన్చెప్పి పంపేస్తే సరి"

"అదంత ఈజీ కాదండి. ఇతగాడికి సెక్షన్లు తెలుసు....."

"ఇహ నువ్వే ఎలావోలా బయట పడెయ్యాలి. నీ ఋణం వుంచుకోన్లే....."

ఇన్స్పెక్టర్ బుర్ర పాదరసంలా పనిచేసింది. ఇంకాస్సేపట్లో ఎస్పీ వస్తారు. ఆయనకి నెల మామూళ్ళివ్వాలి. ఖుష్ చెయ్యాలి. అందుకిది మంచిబేరం!

"సరే - నేను ముగ్గులు పెడతాను గాని మీరెళ్ళండి"

తాశిల్దారు మూర్తి వంక మాడ్చేశాలా చూస్తూ విసవిసా వెళ్ళిపోయాడు.

పిమ్మట మూర్తిని పిలిచి, "నీ పిటీషన్ని రికార్డు చేస్తున్నాను. ఎఫ్ఐఆర్ రాసేస్తున్నాను. ఈ క్యాస్ట్ సర్టిఫికెట్ మీ అమ్మాయి కోసం కదూ. ఆ అమ్మాయి సాక్ష్యమూ కావాలి. ఇప్పుడెక్కడుందీ?" అథార్టీగా అడిగాడు వీరనాయుడు.

"కాలేజీలో..... అది అమాయకురాలండీ. అదెందుకు సార్.....?"

"ఇప్పుడొద్దులే. కాలేజీలో వుందిట. రాత్రికి లిన్నగా ట్రావెలర్స్ బంగళాకి తీసుకురా. ఎస్పీ ముందు వాఙ్మూలం రికార్డు చేద్దాం" ఓ పీసీతో అన్నాడు మిచ్చ్యువస్‌గా నవ్వుతూ.

భయపడిపోయాడు మూర్తి. "సార్సార్..... మా అమ్మాయి జోలికి వెళ్ళకండి సార్. అన్నెం పున్నెం ఎరగని పిల్ల ...!"

"అలాటి వారి సాక్ష్యానికే బలమెక్కువ. నువ్వేం ఇదవ్వకు. నేనూ నీలాగే నేరస్తులు ఎంతటి వారైనా సరే శిక్షించాలంటాను. చట్టం తన పని తాను చేసుకుపోతుందిలే....."

"వద్దు సార్.... ప్లీజ్ సార్..... నా పిటీషన్ వాపస్ తీసుకుంటాన్సార్....." బ్రతిమాలాడు మూర్తి.

"భలే వాడివే. అలా ఎలా కుదుర్తుందీ. లోపలికి నీ ఇష్ట ప్రకారం రావొచ్చు. బయటి కెళ్ళడం మాత్రం నా ఇష్ట ప్రకారమే జరుగుద్ది....."

"మీ కాళ్ళకు దణ్ణం పెడతాను. నన్ను వదిలెయ్యండి సార్. మీరేం చెబితే అది చేస్తాను సార్" కాళ్ళా వేళ్ళా పడ్డాడు.

"నిన్ను వదిలెయ్యాలంటే పదివేలు ఖర్చవ్వుద్ది. ఇంటికి ఫోన్ కొట్టి తెమ్మను వదిలేస్తాను. ఇంకెప్పుడూ లంచం ఇచ్చానూ నేరం చేశానూ అంటూ దీర్ఘాలు తీస్తూ నానా చెత్తా వాగకు. జాగ్రత్త!"

నిస్సహాయంగా చూశాడు మూర్తి. "లంచం ఇచ్చి నేరం చేశానంటూ వచ్చినందుకు లంచం ఇచ్చి వెళ్లాల్సొచ్చింది. ఐ పిటీయూ!"

వీరనాయుడు పడీపడీ నవ్వుతోంటే వణకిపోతూ సెల్‌ఫోన్లో ఎవర్తోనో మాట్లాడాడు మూర్తి.

మరి అరగంటకి ఎలక్ట్రానిక్ మీడియా వారి కెమేరా లైట్ల వెలుగుతో స్టేషన్ నిండిపోయింది.

ఈ హఠాత్పరిణామానికి అదిరిపోయాడు ఇన్‌స్పెక్టర్. పిచ్చిగా చూస్తోంటే చొక్కా గుండీలా ధరించిన రహస్య కెమేరాని మీడియా వారికి అందిచ్చాడు మూర్తి.

"నేను సగటు జీవిని. సామాన్యుడ్ని. అవినీతి కొండని కదిలించలేను. ఏదో ఉడతాభక్తిగా పిపీలికశక్తితో......!"

మూర్తి మాటలు వీరనాయుడి గుండెల్లో విస్ఫోటించాయి!

**(ఆంధ్రభూమి దినపత్రిక 3.9.2011)**